దారి ఇలా.. ప్రయాణం ఎలా?

- అడుగుడుగునా గుంతలతో మద్దికెర- బురుజుల, గుంతకల్లు - మద్దికెర రోడ్లు
- అదే దారిలో కసాపుర క్షేత్రం
- భక్తుల వాహనాలతో నిత్యం రద్దీ
- కనీస మరమ్మతులు చేపట్టని వైనం


అధ్వానంగా మద్దికెర-బురుజుల రోడ్డు


చెరువును తలపిస్తున్న గుంతకల్లు- మద్దికెర రహదారి

మద్దికెర : నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగించే ప్రధాన రహదారి ధ్వంసమవడంతో ప్రయాణం నరకం చూపుతోంది. గుంతకల్లు- మద్దికెర 10 కి.మీ, మద్దికెర- బురుజుల 10 కి.మీ రోడ్లను ఏళ్ల క్రితం నిర్మించారు. కనీస మరమ్మతులకు నోచుకోకపోవడంతో గుంతలమయంగా మారాయి. 10 కి.మీ. చేరుకోవడానికి సాధారణంగా పది నుంచి పదిహేను నిమిషాలు పడుతుంది. కానీ ఈ రోడ్డుపై ప్రయాణానికి దాదాపు గంట పడుతుందంటే రోడ్డు ఏస్థాయిలో ధ్వంసమైందో అర్థం చేసుకోవచ్చు. ఈ రోడ్డులో ప్రముఖ పుణ్య క్షేత్రం కసాపురం ఉండటంతో నిత్యం భక్తుల వాహనాల రద్దీ ఉంటుంది. ఇక శనివారం, ప్రత్యేక రోజుల్లో వందలాది వాహనాలు వస్తుంటాయి. అలాగే గుంతకల్లు నుంచి కర్నూలుకు వెళ్లేందుకు ప్రధాన రహదారి కూడా. దీంతో జిల్లా కేంద్రానికి వెళ్తుంటారు. ఇక వర్షాకాలంలో గుంతల్లో నీరు నిలిచి మడుగులను తలపిస్తుంటాయి. గుంతల లోతు తెలియక వాహనదారులు ప్రమాదాలబారిన పడుతున్నారు. ఈ రహదారి కష్టాలు తప్పించేకునేందుకు కొందరు తుగ్గలి మీదుగా రాకపోకలు సాగిస్తున్నారు. అలాగే మద్దికెర నుంచి రైల్వే జంక్షన్ అయిన గుంతకల్లుకు వెళ్లేందుకు బతుకుదెరువు కోసం నిత్యం వందలాది మంది కూలీలు వాహనాల్లో వెళ్తుంటారు. పలుమార్లు సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకునే నాథుడు కరువయ్యారు. ఇప్పటికైనా రోడ్లను బాగు చేయాలని వాహనదారులు, ప్రయాణికులు కోరుతున్నారు.

నిత్యం నరకమే



ఎల్ఐసీ ఏజెంట్‌గా పనిచేస్తున్నా. రోజూ గుంతకల్లుకు పోవాల్సి ఉంటుంది. మద్దికెర నుంచి గుంతకల్లుకు వెళ్లాలంటే నిత్యం నరకమే. ప్రయాణం సాగదు. పది కి.మీ. ప్రయాణం గంట సేపు పడుతుంది. వాహన కుదుపులకు వెన్ను నొప్పి వస్తోంది. అధికారులు తిరుగుతున్నా పట్టించుకోకపోవడం దారుణం. - మంజునాథ్‌రెడ్డి, మద్దికెర

పోవాలంటే బేజారు



నేను పత్తికొండలో లాయర్‌గా పనిచేస్తున్నా. ఈ రోడ్డుపై రోజూ కోర్టుకు వెళ్లాలంటే బేజారవుతుంది. మద్దికెర నుంచి బురుజుల వరకు కేవలం పది కి.మీ. అయినా ప్రయాణం నరకప్రాయమే. ప్రజాప్రతినిధులు సమస్య పరిష్కారానికి కృషి చేయాలి. - వీరేష్, లాయర్, మద్దికెర.

ఆటో నడపాలంటే భయం



ఆటోలో హంప, మద్దికెర గ్రామాల్లో కుట్టిన నైటీలు తీసుకొని రోజూ గుంతకల్లు మీదుగా పామిడికి వెళ్తుంటాను. 10 కి.మీ దూరం గంట తీసుకుంటుంది. దీంతో ఆటో నడపాలంటే నరకం కనిపిస్తుంది. ఇంటికి వచ్చిన తరువాత ఒళ్లు నొప్పులు, జ్వరాల బారిన పడుతున్నాం. రోడ్డు బాగు చేయిస్తే బాగుంటుంది. - ఫకృద్దీన్, హంప, మద్దికెర

క్లుప్తంగా

అడిగిన వారందరికీ పనులు కల్పించాలి


మాట్లాడుతున్న ఏపీడీ పక్కీరప్ప

తుగ్గలి : అడిగిన వారందరికీ ఉపాధి హామీ పథకం పనులు కల్పించి వలసలను నివారించాలని డ్వామా క్లస్టర్ ఏపీడీ పక్కీరప్ప సూచించారు. స్థానిక స్త్రీ శక్తి భవన్‌లో ఉపాధి పనులపై బుధవారం సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఏపీడీ మాట్లాడుతూ.. వ్యవసాయ పనులు లేని గ్రామాల్లో పనులు ప్రారంభించి వలసలకు అడ్డుకట్ట వేయాలన్నారు. కూలీలకు పనులు కల్పించేందుకు కొత్త పనులు గుర్తించాలన్నారు. పండ్ల తోటల పెంపకం చేపట్టిన రైతులకు ఇబ్బందులు కలగకుండా బిల్లులు అందించాలన్నారు. క్లస్టర్ ప్లాంటేషన్ మేనేజర్ రత్నం, ఏపీవో హేమసుందర్, ఈసీ ప్రదీప్‌కుమార్ పాల్గొన్నారు.

ఆలూరు ఎస్ఐగా దిలీప్ కుమార్



ఆలూరు రూరల్: ఆలూరు ఎస్ఐగా దిలీప్ కుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న వెంకట నరసింహులును పోలీసు ఉన్నతాధికారులు కర్నూలు వీఆర్‌కు పంపించారు. సత్యసాయి జిల్లా వీఆర్‌లో ఉన్న దిలీప్ కుమార్‌ను ఆలూరు ఎస్ఐగా నియమిస్తూ ఉత్తర్వులు ఇవ్వడంతో బుధవారం ఆయన బాధ్యతలు తీసుకున్నారు. ఆయన మాట్లాడుతూ..పేకాట,మట్కా,బెల్టుషాపుల నిర్వహణ వంటి అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. ప్రజల ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు కృషి చేస్తామని చెప్పారు.

వైభవంగా కలశ ప్రతిష్ఠ


కలశాన్ని ప్రతిష్ఠిస్తున్న అర్చకులు

మద్దికెర : స్థానిక కొండమ్మబావిలోనున్న ఉమామహేశ్వర స్వామి దేవాలయంపై బుధవారం వైభవంగా కలశ ప్రతిష్ఠ చేపట్టారు. ఉదయం గణపతి పూజ, కలశ పూజ నవగ్రహ ఆరాధన, అర్చనలు, విశేష పూజ, పూర్ణాహుతి, మహా మంగళహారతి తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం మంత్రోచ్ఛారణల మధ్య గోపురంపై కలశాన్ని ప్రతిష్ఠించారు. ఆలయంలో జోడు లింగాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు దాతలు కృష్ణమూర్తి అన్నదానం చేశారు. అర్చకులు సిద్ధ, నిర్వాహకులు ఈరన్నగౌడ్, రమేష్, సత్తిరెడ్డి, రాజు, హంపయ్య పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అయ్యప్ప స్వామి పడిపూజ


పూజ చేస్తున్న దృశ్యం

వెల్దుర్తి(కృష్ణగిరి): స్థానిక అయ్యప్పస్వామి దేవాలయంలో బుధవారం మాలధారులు అయ్యప్ప స్వామికి భక్తిశ్రద్ధలతో పడిపూజ చేశారు. స్వామి విగ్రహానికి ఆలయ ప్రధాన అర్చకుడు యార్లపాటి శ్రీధర్‌శర్మతో పాటు గురుస్వాములు రామకృష్ణాస్వామి, గోపి స్వాములు పూజ కార్యక్రమాన్ని జరిపించారు. సాయంత్రం ఉత్సమూర్తిని ప్రత్యేకంగా అలంకరించి గ్రామంలో ఊరేగించారు.

చెత్త నిర్వహణ సక్రమంగా చేపట్టాలి


అల్లుగుండులో చెత్త నిర్వహణ షెడ్డును పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ లక్ష్మి

వెల్దుర్తి(కృష్ణగిరి): గ్రామాల్లో చెత్త నిర్వహణ సక్రమంగా చేపట్టాలని డీఎల్‌పీఓ లక్ష్మి ఆదేశించారు. మండలంలోని అల్లుగుండు గ్రామంలోని చెత్త సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ.. గ్రామాల్లో తడి, పొడి చెత్తను రోజూ సేకరించాలన్నారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడంతోపాటు చెత్త ద్వారా వానపాముల ఎరువును తయారీ చేసి అమ్మి ఆదాయాన్ని సమీకరించాలని సూచించారు. అలాగే తాగునీటి పైప్‌లైన్ లీకేజీల పట్ల అప్రమత్తంగా ఉండాలని, నిబంధనల మేరకు క్లోరినేషన్ చేయాలని, పరిశుభ్రత పాటించాలని ఆదేశించారు. డీపీడీసీ మంజుల, ఆర్‌పీ పద్మావతి పాల్గొన్నారు.

పది పరీక్ష ఫీజు గడువు పెంపు

తుగ్గలి : పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే రెగ్యులర్, ఫెయిల్ విద్యార్థులు పరీక్ష ఫీజు చెల్లించేందుకు ఈనెల 26వ తేదీ వరకు రాష్ట్ర విద్యా శాఖ గడువు పొడిగించినట్లు ఎంఈఓ రమావెంకటేశ్వర్లు తెలిపారు. రూ.50 అపరాధ రుసుముతో ఈనెల 27నుంచి డిసెంబర్ 2వ తేదీ వరకు, రూ.200 అపరాధ రుసుముతో డిసెంబర్ 3నుంచి 9వ తేదీ వరకు, రూ.500 అపరాధ రుసుముతో డిసెంబర్ 10నుంచి 16వతేదీ వరకు చెల్లించవచ్చని చెప్పారు.

డీలర్లూ.. డీడీలు చెల్లించండి

మద్దికెర : మండలంలోని చౌకదుకాణం డీలర్లు బియ్యం, చక్కెరకు డీడీలు చెల్లించాలని తహసీల్దార్ హుసేన్ సాహెబ్ తెలిపారు. బుధవారం స్థానిక కార్యాలయంలో డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ డీడీలు చెల్లించడంలో ఆలస్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. డీలర్లు సకాలంలో నిత్యావసర వస్తువులు ఎండీయూ ఆపరేటర్ల ద్వారా లబ్ధిదారులకు అందేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు.

ఉద్యోగులు సమయపాలన పాటించాలి

ఆలూరు రూరల్: సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించాలని ఆలూరు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ సూర్యనారాయణ అన్నారు. బుధవారం ఆయన స్థానిక గ్రామ పంచాయతీ ఈఓ ప్రభాకర్‌తో కలిసి సచివాలయం-2ను తనిఖీ చేసి మాట్లాడారు. రోజూ బయోమెట్రిక్ హాజరు తప్పనిసరిగా వేయాలన్నారు. సచివాలయానికి వచ్చే అర్జీలను ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కరించాలన్నారు. అనంతరం సచివాలయంలో రికార్డులు పరిశీలించారు.

టీబీ డ్యాం గేట్లకు నిధులు కేటాయించండి


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బి.విరూపాక్షి

ఆలూరు: తుంగభద్ర జలాశయం గేట్లు మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రూ.250 కోట్లు కేటాయించాలని ఆలూరు ఎమ్మెల్యే బి.విరూపాక్షి డిమాండ్ చేశారు. స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహం ఆవరణలో బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రెండు నెలల క్రితం 19వ గేటు నీటి ప్రవాహంలో కొట్టుకుపోయిన సమయంలో మొత్తం గేట్లు మార్చాల్సి ఉందని గేట్ల తయారీ నిపుణుడు కన్నయ్య నాయుడు చెప్పినా ప్రభుత్వం పట్టించుకోకుండా కేవలం రూ.52 కోట్లు టీబీ డ్యాం మరమ్మతులకు విడుదల చేయడం సరికాదన్నారు.

వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలి

వాల్మీకి కులస్తులు ఏజెన్సీ ప్రాంతాల్లో ఎస్టీలుగా, రాయలసీమ జిల్లాల్లో బీసీలుగా గుర్తిండం దారుణమన్నారు. ఆలూరు నియోజకవర్గం నుంచి కర్ణాటకకు వలస వెళ్లి స్థిరపడిన వారందరినీ అక్కడి ప్రభుత్వం ఎస్టీలుగా గుర్తించిందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వంతో చర్చించి వెంటనే ఎస్టీ జాబితా పునరుద్ధరించాలని కోరారు. వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకటేశ్వర్లు, భాస్కర్,మండలకో-కన్వీనర్ వీరేష్, శివన్న, పెట్రోల్ బంక్ కిశోర్,బద్రినాథ్, వీరేష్ ఉన్నారు.

ముగిసిన ప్రతిష్ఠోత్సవాలు


ప్రతిష్ఠించిన ఆంజనేయస్వామి విగ్రహానికి పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

కృష్ణగిరి: మండలంలోని అమకతాడు గ్రామంలో మూడు రోజులుగా జరిగిన విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు బుధవారం ముగిశాయి. ఉదయం ఆంజనేయస్వామి దేవాలయాన్ని ప్రారంభించి స్వామి విగ్రహానికి ప్రాణ ప్రతిష్ఠ గావించారు. అనంతరం స్వామి వారి మూలమూర్తిని విశేషంగా అలంకరించి, ప్రత్యేక పూజలు చేసి భక్తులను దర్శనానికి అనుమతించారు. అలాగే సుంకులమ్మ, వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయాల వద్ద ధ్వజస్తంభ ప్రతిష్ఠ, వాల్మీకి విగ్రహం, జాతీయ రహదారిలో గ్రామ స్టేజీ వద్ద అభయ ఆంజనేయస్వామి విగ్రహం, నాభిశిలలను పండితుల మంత్రోచ్చారణల మధ్య శాస్త్రోక్తంగా ప్రతిష్ఠించారు. పత్తికొండ మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి పూజల్లో పాల్గొన్నారు. సాయంత్రం గ్రామస్తులు తమ ఆడపడుచులకు ఒడిబియ్యం పోశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు వెంకటస్వామి, గోపాల్‌రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, సర్పంచ్ బోయ సర్వేశ్వరి, చంద్రశేఖర్‌రెడ్డి, బ్రహ్మానందరెడ్డి, వీరభద్రుడు, హనుమంతు, వెంకటేష్ పాల్గొన్నారు.

విద్యార్థుల మేధస్సుకు పదును పెట్టాలి

వెల్దుర్తి(కృష్ణగిరి): పాఠశాలల్లో విద్యార్థుల మేధస్సుకు పదును పెట్టాలని ఎంఈఓ ఇందిర ఉపాధ్యాయులకు సూచించారు. మండలంలోని సూదేపల్లె హైస్కూల్లో బుధవారం జరిగిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రతి ఉపాధ్యాయుడు సమయపాలన తప్పక పాటించాలన్నారు. అపార్ నమోదును సక్రమంగా చేపట్టాలని, ఎఫ్-2 మార్కుల నమోదు తదితర వాటిని ఆన్‌లైన్లో నమోదు చేయాలని చెప్పారు. కార్యక్రమంలో ట్రైనర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్య స్వామికి ప్రత్యేక పూజలు


వైద్యసిబ్బందికి స్వామి వారి చిత్రపటాలు అందజేసిన దృశ్యం

మద్దికెర : స్థానిక సుబ్రహ్మణ్యస్వామి దేవాలయంలో బుధవారం వైద్యసిబ్బంది ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు వారికి స్వామి చిత్ర పటాలు అందజేసి, ప్రసాదం పంపిణీ చేసి ఆశీర్వచనం చేశారు. వైద్యులు శ్రీలక్ష్మి, రాగిణి, సీహెచ్‌ఓ నిరంజన్‌బాబు, సూపర్‌వైజర్ సూర్యనారాయణ వైద్య సిబ్బంది అంజలి, లక్ష్మి పాల్గొన్నారు.

మిగులు భూములుగా చూపొద్దు

హొళగుంద: తాతల కాలం నాటి నుంచి తమ పేరిట ఉన్న సొంత భూములను రెవెన్యూ రికార్డుల్లో మిగులు భూములుగా చూపుతున్నారని, వాటిని తిరిగి తమ పేరిట మార్పు చేయాలని ఆలూరు మాజీ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్, రైతులు పంపాపతి, సిందువాళ ఎర్రిస్వామి కోరారు. బుధవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ.. భూములను రికార్డుల్లో మార్చాలని ఆధారాలను సమర్పించినా పట్టించుకోవడం లేదన్నారు. సమస్య పరిష్కరించాలని స్థానిక రెవెన్యూ అధికారులతో పాటు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి వినతి పత్రాలు అందజేశామని, అయినా ఇక్కడి అధికారులు పట్టించుకోకుండా ఇదిగో అదిగో అంటూ కాలం వెళ్లదీస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

వేదావతినదిపై ప్రాజెక్టు నిర్మించాలి


ధర్నా చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

ఆలూరు: హాలహర్వి మండలం గూళ్యం గ్రామం వద్ద నిర్మించతలపెట్టిన వేదావతి నదిపై ప్రాజెక్టు పనులను వెంటనే ప్రారంభించాలని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహం నుంచి సీపీఎం, సీపీఐ, కాంగ్రెస్ పార్టీ, ఎమ్మార్పీఎస్, డీవైఎఫ్ఐ, ఏపీ రైతు సంఘం, వ్యవసాయకార్మిక సంఘం తదితర సంఘాల నాయకులు ఆలూరు మండల సీపీఎం కార్యదర్శి షాకీర్ నేతృత్వంలో అంబేడ్కర్ సర్కిల్ వరకు ర్యాలీగా తరలివచ్చి అక్కడ ధర్నా, రస్తారోకో చేపట్టారు. దీంతో వివిధ ప్రాంతాలకు వెళ్లే వాహనాలు భారీగా నిలిచిపోవడంతో ఆలూరు సీఐ వెంకటచలపతి సమక్షంలో ఎస్ఐ దిలీప్‌కుమార్, హాలహర్వి ఎస్ఐ చంద్ర , పోలీసులు ధర్నా విరమించాలని సూచించారు. అయినా వారు వినిపించుకోకపోగా ధర్నా కొనసాగించడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని, పోలీసులు గట్టిగా సూచించడంతో ప్రజా సంఘాల నాయకుల మధ్య వాదన జరిగింది. సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి గౌస్‌దేశాయ్, సీపీఎం జిల్లా కార్యవర్గదర్శి సభ్యుడు పీఎస్.రాధాకృష్ణ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ లక్ష్మినారాయణ, సీపీఐ జిల్లా రైతు సంఘం కార్యదర్శి రామకృష్ణ, బీఎస్పీ ఇన్‌చార్జ్ రామలింగయ్య తదితరులు మాట్లాడారు. ఎన్నికల సమయంలో చంద్రబాబునాయుడు వేదావతినదిపై ప్రాజెక్టు నిర్మించి 8 టీఎంసీలు నీటిని నిలువ చేస్తామని హామీ ఇచ్చారని, ఆ హామీని నిలబెట్టుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆలూరు నియోజకవర్గ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు కత్తి రామాంజనేయులు, సీపీఎం నాయకులు నారాయణస్వామి, హనుమంతు, బాలకృష్ణ, వెంకటేశ్వర్లు, ఈరన్న, ఐద్వా నాయకురాళ్లు షేకుంబీ,మైనా, గౌసియా, మోటయ్య పాల్గొన్నారు.

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు


విద్యార్థినికి ప్రశంసా పత్రం అందజేస్తున్న రిటైర్డు డీఎస్పీ రంగముని

వెల్దుర్తి(కృష్ణగిరి): స్థానిక గ్రంథాలయంలో వారం రోజులుగా జరిగిన వారోత్సవాలు బుధవారం ముగిశాయి. ముగింపు వేడుకల్లో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికైన ఎస్. బోయినపల్లి హైస్కూల్ హిందీ పండిట్ ఖాజాబేగ్‌ను గ్రంథాలయంలో ఘనంగా సన్మానించి ఆయన సేవలను పలువురు కొనియాడారు. వారోత్సవాల్లో భాగంగా క్విజ్, వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు సాయిప్రసాద్, అధికారి కవిత బాయి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆలూరు: విద్యార్థులు పోటీతత్వాన్ని అలవర్చుకోవాలని, క్రమశిక్షణతో మెలిగి ఉన్నత స్థానాలను అధిరోహించాలని రిటైర్డు డీఎస్పీ రంగముని విద్యార్థులకు సూచించారు. స్థానిక శాఖా గ్రంథాలయ అధికారి విజయ్‌భాస్కర్ ఆధ్వర్యంలో గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సందర్భంగా బుధవారం వివిధ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో ప్రతిభచాటిన వారికి ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. రిటైర్డు డీఎస్పీ వీరస్వామి, ఆర్మీ ఎస్ఐ నర్సిరెడ్డి, రిటైర్డు ఉపాధ్యాయులు దేవదానం,ఈరన్న, కవి అన్నెం శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆస్పరి: స్థానిక గ్రంథాలయంలో బుధవారం వారోత్సవాల ముగింపు కార్యక్రమం లైబ్రేరియన్ విశ్వనాథరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. జెడ్పీటీసీ సభ్యుడు దొరబాబు, కేడీసీసీ బ్యాంకు జిల్లా మాజీ డైరెక్టర్ మూలింటి రాఘవేంద్ర మాట్లాడుతూ విజ్ఞానాన్ని పెంపొందించుకునేందుకు విద్యార్థులు పుస్తకాలు చదవడం అలవర్చుకోవాలన్నారు. అనంతరం వివిధ పోటీల్లో రాణించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు సుంకుర రామాంజనేయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పంటల బీమా చేయించుకోవాలి

హాలహర్వి: రబీలో భాగంగా సాగు చేసిన జొన్న పంటకు రూ.297, శనగ పంటకు ఎకరాకు రూ.420 చొప్పున పంటల బీమా ప్రీమియం చెల్లించాలని ఏఓ శివశంకర్ సూచించారు. మండలంలోని మాచనూరు, బాపురం గ్రామాల్లో ।పొలం పిలుస్తోంది₹ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మంగళవారం నుంచి ఆప్షన్ వచ్చిందని, రైతులందరూ తప్పనిసరిగా పంటలకు ఇన్సూరెన్స్ చేసుకోవాలని తెలిపారు. వీఏఏలు ఇంద్రజ, విజయ్, రైతులు పాల్గొన్నారు.


నేమకల్లు లో ఏపుగా పెరిగిన జొన్న పైరు

ఏపుగా పెరిగిన జొన్న

చిప్పగిరి: రబీ సీజన్‌లో భాగంగా మండలంలో సాగు చేసిన జొన్న పైర్లు ఏపుగా పెరిగి రైతుల్లో ఆశలు రేకెత్తిస్తోంది. కుందనగుర్తి,నగరడోణ,రామదుర్గం,బెల్డోణ తదితర గ్రామాల్లో రైతులు అధిక విస్తీర్ణంలో జొన్న పంట సాగు చేశారు. రబీలో సీజన్‌లో ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు జొన్న పైర్లు ఎన్నడూ లేనంతగా ఏపుగా పెరిగాయని వారు చెబుతున్నారు. సాధారణంగా ఆరు అడుగుల వరకు పెరిగే జొన్న పైరు ఈ సంవత్సరం సుమారు పది అడుగుల వరకు పెరిగింది. మండలంలో దాదాపు 600 వందల ఎకరాల్లో జొన్న పైరు సాగు చేసినట్లు ఏఓ విజయ లక్ష్మి తెలిపారు.

లోకాయుక్త, హెచ్‌ఆర్‌సీని తరలిస్తే ఉద్యమమే


పత్తికొండలో నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

పత్తికొండ(తుగ్గలి) : లోకాయుక్త, హెచ్‌ఆర్‌సీని అమరావతికి తరలిస్తే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రంగస్వామి, న్యాయవాదులు హుల్తెన్న, నాగభూషణరెడ్డి,అశోక్‌కుమార్ హెచ్చరించారు. లోకాయుక్త, హెచ్‌ఆర్‌సీ తరలింపునకు నిరసనగా బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం పత్తికొండ పట్టణంలో నాలుగు స్తంభాల కూడలిలో న్యాయవాదులు నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ.. శ్రీబాగ్ ఒప్పందం ప్రకారం రాష్ట్ర సమగ్రాభివృద్ధికి గత ప్రభుత్వం కర్నూలులో లోకాయుక్త, హెచ్‌ఆర్‌సీ, వక్ఫ్ ట్రిబ్యునల్ ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. వీటిని తరలించకుండా చూడాల్సిన బాధ్యత మంత్రి టీజీ భరత్, ఎమ్మెల్యేలదేన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కార్యాలయాలను తరలించి కర్నూలుకు తీవ్ర అన్యాయం చేస్తోందన్నారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మహేష్, కోశాధికారి రాజశేఖర్ సీనియర్ న్యాయవాదులు ఎల్లారెడ్డి, శ్రీనివాసరెడ్డి, సత్యనారాయణ, మల్లికార్జున, రమేష్, ప్రసాద్, సూరజ్ పాల్గొన్నారు.


పొలాలను కప్పేసిన పొగమంచు


లైటు వేసుకొని వెళ్తున్న ద్విచక్ర వాహనదారుడు


పొలాలకు వెళ్తున్న కూలీలు


పొగమంచులోనే సూర్య భగవానుడు

మంచు దుప్పటి

మద్దికెర : చలి తీవ్రత పెరిగింది. కొద్ది రోజులుగా పొగమంచు కమ్ముకుంటుండంతో పంటలు వాడిపోతాయోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. మండల కేంద్రం పరిసరాల్లో బుధవారం ఉదయం 7 గంటలైనా దట్టంగా కమ్ముకున్న పొగమంచు వదలకపోవడంతో రహదారులు కనబడక ప్రజలు, కూలీలు, వాహన దారులు ఇబ్బందులు పడ్డారు. వాహనదారులు దారి కనిపించక, ఎదురుగ వచ్చే వాహనాలను గుర్తించలేక పోతుండటంలో లైట్లు వేసుకొని వెళ్తున్నారు. పైర్లపై పొగమంచు కురవడం వల్ల పంటలకు వచ్చిన పూత రాలిపోతుందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వివరాలు పక్కాగా నమోదు చేయాలి


మాట్లాడుతున్న డీఎల్‌పీవో వీరభద్రప్ప

తుగ్గలి : గ్రామాల్లోని వివరాలన్నీ పక్కాగా ఆన్‌లైన్ చేయాలని డీఎల్‌పీవో వీరభద్రప్ప సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం స్వర్ణ పంచాయతీ కార్యక్రమంలో భాగంగా సేకరించాల్సిన వివరాలపై పంచాయతీ కార్యదర్శులకు అవగాహన కల్పించారు. గ్రామాల్లోని ఇంటి స్థలం, భవనం, పన్నులు, ప్రజలకు అందించే సేవలన్నీ పక్కాగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. దీని వల్ల ఎంత పన్ను చెల్లిస్తున్నారు, ఏయే సేవలు పొందుతున్నారనే విషయాలను ఇంటి యజమాని ఎక్కడి నుంచైనా ఆన్‌లైన్‌లో తెలుసుకునే వీలుంటుందన్నారు. వివరాల నమోదుతో పాటు పన్నులు కచ్చితంగా రాబట్టాలన్నారు. తాగునీటి సరఫరా, వీధి దీపాలు, పారిశుద్ధ్య నిర్వహణ, చెత్త సంపద కేంద్రాల నిర్వహణ, పరిసరాల పరిశుభ్రతపై దృష్టి సారించాలన్నారు. వాటర్ ట్యాంకులను క్రమం తప్పకుండా శుభ్రం చేస్తూ ప్రజలకు సురక్షిత నీరు సరఫరా చేయాలన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తి స్థాయిలో నియంత్రించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ఈవోపీఆర్డీ శ్రీహరి పాల్గొన్నారు.